ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



జూలై 29 నుంచి ప్రత్యేక లోక్ అదాలత్

కడప(రూరల్) జూన్ 14: సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం జూలై 29 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన జడ్జి, డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్ జి.శ్రీదేవి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. కేసులు రాజీ చేసుకునేందుకు కక్షిదారులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ 25వ తేదీ శనివారం ఉదయం 10-30 గంటలకు నోటీసులు అందుకున్న కక్షిదారులు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో నిర్వహించే ముందస్తు లోక్ అదాలత్‌కు హాజరు కావాలని తెలిపారు.



ఫైబర్‌నెట్.. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలల రూపం.. 2014-19 కాలంలో ప్రతి ఇంటికీ ఇంటర్నెట్‌తో పాటు టీవీ చానెల్స్, ఫోను సౌకర్యం కల్పించాలని ఒక్కో కనెక్షన్‌కు మూడుసేవలు ఇవ్వాలన్న లక్ష్యంతో ఫైబర్‌నెట్‌కు అంకురార్పణ చేశారు. అతి తక్కువ ఖర్చుతో ఫైబర్‌నెట్ విస్తరించారు. కేవలం నెలకు రూ.235తో అన్‌లిమిటెడ్ నెట్, ఎంటర్‌టైన్‌మెంటు న్యూస్‌చానెల్స్, టెలిఫోను సౌకర్యం అందుబాటులో ఉండేది. అప్పట్లో ఫైబర్‌నెట్ సేవల కనెక్షన్ కోసం జనం ఎగబడేవారు. అయితే ఏముహూర్తాన వైసీపీ అధికారంలోకి వచ్చిందో ఫైబర్‌నెట్‌ను ముంచేసింది. చంద్రబాబు పేరు చెరిపివేయాలన్న లక్ష్యంతో కక్షపూరితంగా నిర్వీర్యం చేసింది. దాన్ని మూతవేసిందా అంటే అలా కాదు.. ఫైబర్‌నెట్‌ను వైసీపీ శ్రేణులకు పునరావస కేంద్రంగా మార్చుకుంది.

వైసీపీ అడ్డాగా ఫైబర్ నెట్

- వైసీపీ శ్రేణులకు ఇందులో ఉద్యోగాలు
- వైసీపీ, పులివెందుల.. ఈ రెండే అర్హతలు
- కొందరికి రెండు ఉద్యోగాలు
- జనం సొమ్ముతో ఇష్టారాజ్యంగా జీతాలు
- మరికొందరికి ఇంట్లో కూర్చున్నా జీతాలే
- కొలువు ఫైబర్‌నెట్‌లో..
- పనిమాత్రం చంద్రబాబుపై సోషల్ మీడియాలో విష ప్రచారం

(కడప-ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్‌లో 2014-19 టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడిజిల్లాలో 60వేల కనెక్షన్లు ఉండేవి. ఇప్పుడు 35వేల కనెక్షన్లు మాతమే ఉన్నాయి. అప్పుడు ఉమ్మడి జిల్లాలో 16 మంది సిబ్బంది మొత్తాన్ని పర్యవేక్షించేవారు. ఇప్పుడు సుమారు వంద మంది ఇందులో పనిచేస్తున్నారు. ఇంతమందిని నియమించినా కనెక్షన్లు పెరగలేదు సరికదా.. ఫైబర్‌నెట్ సేవలు ప్రజలకు సరిగా అందను కూడా లేదు. అప్పట్లో నెలకు చార్జి రూ.235 ఉంటే ఇప్పుడు రకరకాల ప్లాన్లు పెట్టి రూ.400, 600, 650 వంతున వసూలు చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా నియామకాలు

ఇప్పుడంతా ఇంటర్నెట్ యుగం. ఇంటర్నెట్‌ను పల్లెల్లో ప్రతి ఇంటికీ తీసుకెళ్లే గొప్ప అవకాశం ఫైబర్‌నెట్‌కు ఉంది. అయితే దాన్ని నిర్వీర్యం చేశారు. వైసీపీ కార్యకర్తలకు మాత్రం పునరవాస కేంద్రంగా మార్చారు. సెక్యూరిటీ గార్డు ఉద్యోగం పొందాలంటే కూడా అర్హత, అనుభవం చూస్తారు. ఫైబర్‌నెట్‌లో కొలువు కావాలంటే మాత్రం రెండే అర్హతలు.. ఒకటి పులివెందుల, రెండు వైసీపీ భజన బ్యాచ్ కావడం. ఈ రెండు అర్హతలుంటే చాలు చదువు సంధ్య అక్కరలేదు. పైగా అందరిదీ ఒకే సామాజిక వర్గం. ఆగమేఘాల మీద అవసరం లేకున్నా సరే ఇక్కడ నియామకాలు చేసేశారు. ఉమ్మడి జిల్లాలో టీడీపీ ప్రభుత్వంలో 16 మంది సిబ్బంది 60వేల కనెక్షన్లు మెయింటెనెన్స్ చేస్తే.. ఇప్పుడు సుమారు వందమందిని నియమించుకున్నారు. కనెక్షన్లు మాత్రం భారీగా పడిపోయాయి.


అంతా పులివెందులే

జిల్లాలో ఫైబర్‌నెట్ కేవలం వైసీపీ కార్యకర్తలకు ఆవాసంగా మారిందనే ఆరోపణలున్నాయి. ఇక్కడ పనిచేసే సిబ్బందిలో 80 శాతం పైగా పులివెందుల, రాయచోటి మండలంలోని చిన్నమండెంకు చెందిన వారని చెబుతారు. ఫైబర్‌నెట్ ఎండీ మధుసూధన్‌రెడ్డిది రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండెం సొంత మండలం. దీంతో ఆయన సిఫారసు చేసిన వ్యక్తులు ఇందులో ఉద్యోగం చేస్తున్నట్లు చెబుతారు. ఇక ఎక్కువ భాగం పులివెందుల నియోజకవర్గానికి చెందిన వైసీపీ కార్యకర్తలే ఇక్కడ ఉన్నారు. అవసరం లేకున్నా ఓ ప్రజాప్రతినిధి లెటరుతో ఇక్కడ నియామకాలు చేపట్టినట్లు సమాచారం. కడప జిల్లాలోనే కాదు.. ఇతర జిల్లాల్లో కూడా పులివెందుల వాళ్లు ఫైబర్‌నెట్‌లో పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. పులివెందుల వారు ఉద్యోగానికి అనర్హులని కాదు.. అయితే కేవలం వైసీపీ బ్రాండ్, ఆ ప్రాంత ఓ ప్రజాప్రతినిధి సిఫారసుతో ఉద్యోగాలు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. ఒక్కొక్కరికి రూ.18వేల నుంచి రూ.30వేల మధ్య వేతనాలు ఉన్నాయి.

వైసీపీ నేత ఇంట్లో ఎక్విప్‌మెంటు

ఫైబర్‌నెట్ ఎక్విప్‌మెంటు జిల్లాలోని ప్రతి సబ్‌స్టేషన్ గ్రామ పంచాయతీలో ఉంది. నెట్‌కు సంబంధించి ఏదైనా సమస్య తెలెత్తితే కేబుల్‌టీవీ, నెట్‌కు అంతరాయం ఏర్పడితే ఆ జోనల్ ఇంజనీరుకు కేవలం సమాచారం మాత్రం ఇవ్వాల్సి ఉంది. అందుకోసం భారీ ఎత్తున నియామకాలు చేపట్టినట్లు చెబుతారు. కేవలం కొందరు వైసీపీ వారికి పునరావాసం కోసమే అవసరం లేకున్నా ఉద్యోగాలు సృష్టించినట్లు చెబుతారు. లింగాల మండలం అమగంపల్లెలో కొందరు విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు ఫైబర్‌నెట్‌లో పనిచేస్తున్నారు. ఇంకొందరు ఉద్యోగాలు చేయకుండానే ఇంట్లోనే కూర్చుని జీతాలు తీసుకున్నట్లు చెబుతారు. వాస్తవానికి ఎక్విప్‌మెంటు సబ్‌స్టేషన్, గ్రామ పంచాయతీ ఆఫీసులో ఉండాలి. అయితే కడప నగ శివారులోని శాటిలైట్ సిటీలో ఎక్విప్‌ఎమెంటు ఓ వైసీపీ నేత ఇంట్లో ఉంచడం విమర్శలకు తావిస్తోంది.

చంద్రబాబుపై విషం చిమ్మడమే



ఫైబర్‌నెట్‌లో ఉద్యోగాలు పొందిన పులివెందుల బ్యాచ్.. అన్నం పెట్టే సంస్థను బలోపేతం చేసి కనెక్షన్లు ఏమైనా పెంచిందా అంటే అదేం లేదు. టీడీపీ హయాంలో 60వేలున్న కనెక్షన్లు సగానికి తగ్గిపోయాయి. కొత్త కనెక్షన్ బాక్సులు లేవు. జీతాలు తీసుకునేందుకే పరిమితమయ్యారు. సంస్థ అభివృద్ధిని గాలికి వదిలేసి కేవలం చంద్రబాబునాయుడు మీద సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు చేయడానికే పరిమితమైనట్లుంది. కొందరు సిబ్బంది టీడీపీపై తీవ్ర దూషణలతో అనుచిత పోస్టులు పెట్టినట్లు తెలుస్తోంది. చంద్రబాబు సీఎం కావడంతో కొందరు సిబ్బంది ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర సోషల్ మీడియాలో ఖాతాలను డీయాక్టివేట్ చేసుకోవడం గమనార్హం. మరలా ఫైబర్‌నెట్‌లో కొనసాగేందుకు టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రదక్షిణలు చేస్తుండటం విశేషం.

రాష్ట్ర రవాణా శాఖ
మంత్రిగా రాముడు

- యువజన, క్రీడా శాఖలూ ఆయనకే..
- నేడు జిల్లాకు రాక..
- ఘనస్వాగతానికి కార్యకర్తల సన్నాహాలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు యువజన, క్రీడాశాఖలను కేటాయించారు. రాయచోటి ఎమ్మెల్యేగా తొలిసారిగా గెలిచిన రాంప్రసాద్‌రెడ్డిని మంత్రి పదవి వరించిన విషయం తెలిసిందే. ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శుక్రవారం శాఖలను కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే ముఖ్యమైన శాఖలలో నాల్గవశాఖ అయిన రవాణాశాఖను రాముడికి కేటాయించారు. అదేవిధంగా యువజన, క్రీడాశాఖలు కూడా అతి ముఖ్యమైనవే. దీనిపైన రాముడి వర్గం సంబరాలు జరుపుకుంటోంది. మానాయకుడిపై నమ్మకంతోనే.. ఇంత ముఖ్యమైన శాఖలు అప్పగించారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కడప, అన్నమయ్య, చిత్తూరు పార్లమెంటు పరిధిలో రాంప్రసాద్‌రెడ్డి ఒక్కడికే మంత్రి పదవి వచ్చిన విషయం తెలిసిందే. 62 సంవత్సరాల రాయచోటి నియోజకవర్గ చరిత్రలో మొదటిసారిగా మంత్రి పదవి రాముడిని వరించింది.

నేడు జిల్లాకు రాక

మంత్రి పదవి స్వీకరించిన తర్వాత తొలిసారిగా రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి శనివారం జిల్లాకు వస్తున్నట్లు ఆయన వర్గీయులు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచి.. విజయవాడకు వెళ్లి మంత్రి పదవితో వస్తుండడంతో ఆయన వర్గీయులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటూ.. భారీ స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. కడప జిల్లా పోరుమామిళ్ల నుంచి స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడి నుంచి భారీ సంఖ్యలో వాహనాలలో వెళ్లనున్నారు. రాయచోటి పట్టణంలో భారీ ర్యాలీ చేయనున్నారు. ఈ ర్యాలీకి నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రానున్నారు.

రాయచోటిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా : మంత్రి మండిపల్లి

రాయచోటి నియోజవర్గ ప్రజల ద్వారానే.. నాకు మంత్రి పదవి వచ్చింది. రాయచోటి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయడం నా బాధ్యత.. మంత్రివర్గంలోని అన్ని శాఖల మంత్రులతోనూ.. సత్సంబంధాలు పెట్టుకుని.. రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకొస్తా. రాయచోటి నియోజకవర్గానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తాను.. అదే విధంగా రోడ్డు ప్రమాదాలు లేని రాష్ట్రంగా రాష్ట్రాన్ని చేయడమే లక్ష్యంగా పని చేస్తాను. భద్రతా చట్టాన్ని సక్ర మంగా వినియోగించేందుకు చర్యలు తీసుకుంటా. కాలం చెల్లిన వాహనాల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ స్టేడియాలు నిర్మించేందుకు కృషి చేస్తాం. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా కల్పించేందుకు కృషి చేస్తాం.. నాపై నమ్మ కం ఉంచి.. నాకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో పాటు.. మంత్రిపదవిని ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారాలోకేష్‌కు ధన్యవాదాలు తెలుపు తున్నానన్నారు.



ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

కడప నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం

- త్వరలో కార్యాచరణకు రూపకల్పన
- కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి



కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 14: కడప నియోజకవర్గం అభివృద్ధే ప్రధాన కర్తవ్యమని ఎమ్మెల్యే ఆర్.మాధవి తెలిపారు. త్వరలో అన్ని ప్రభుత్వ శాఖలతో సమీక్షించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో తాను కడ ప ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే దిశగా అడుగులు వేస్తామన్నారు. వైసీపీ హయాంలో జరిగిన అవినీతికి సహకరించిన అధికారులు తీరు మార్చుకోవాలని, లేదంటే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం ద్వారకనగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో టీడీపీ చరిత్ర సృష్టించిందన్నారు. కాంగ్రెస్, వైసీపీకి కంచుకోటగా ఉన్న కడప నియోజకవర్గాన్ని టీడీపీ కూలగొట్టిందన్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామన్నారు. అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. టీడీపీలో ఉండి, కొంత మంది వ్యతిరేకంగా పనిచేశార ని, అలాంటివారిని కూడా ఉపేక్షించేదిలేదన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఇస్తామని అలాగే టీడీపీ పెద్దలను కలుపుకుని అభివృద్ధి చేస్తామన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2024 రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయం రూపొందిందన్నారు. చం ద్రబాబు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసంతకంగా మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు, అన్న క్యాంటిన్ల పునరుద్ధరణ వంటి ఐదు సంతకాలు చేసి ప్రజల్లో ఆనందం నింపారన్నారు. గత ఐదేళ్లలో ఎమ్మెల్యే చేసిన ప్రతి అవినీతిని వెలికితీస్తామన్నారు. ప్రధానంగా భూకబ్జాలు, మట్టిమాఫియా, గంజాయిమాఫియా, దొంగబంగారం మాఫి యా వంటివి బయటికి లాగుతామని స్పష్టం చేశారు. అవినీతికి తావులేని చంద్రబాబు పాలనకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ఎన్టీఆర్ హౌసింగ్ లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు త్వరలో అందిస్తామన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

- జిల్లా కోర్టు ఎదుట చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

కడప(రూరల్), జూన్ 14: వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు-2022ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రద్దుచేయడం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కోర్టు ఎదుట టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా న్యాయవాదులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు జీఎస్ మూర్తి, జిల్లా అధ్యక్షుడు, మాజీ ఏపీపీ గంగిరెడ్డి శివశంకర్‌రెడ్డి, మాజీ జీపీ గడ్డ గుర్రప్ప, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్ తదితరులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వైసీపీ పతనానికి నాంది పలికిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఏకపక్షంగా, నిర్లక్ష్య వైఖరితో, న్యాయ వ్యవస్థ ప్రాధాన్యతను తగ్గించేలా, ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేసేందుకు ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును తీసుకొచ్చిందన్నారు. ప్రజలు, రైతులు వారి అవసరాలకు ఆస్తులను అమ్ముకోవాలంటే టైటిలింగ్ యాక్టు ప్రకారం ప్రభుత్వ అనుమతి కావాలన్నారు. భూ సమస్య వచ్చినప్పుడు కోర్టుకు వెళ్లి న్యాయం పొందడానికి వీలులేకుండా చేశారన్నారు. ఇంతటి ప్రమాదకరమైన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు పరచాలని టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, అన్ని వర్గాల వారు ఉద్యమించారన్నారు. కానీ అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రజల వ్యతిరేకతను తేలిగ్గా తీసుకొని ఆపహాస్యం చేసిందన్నారు. దీంతో అప్పటి ప్రతిపక్షనేత నారా చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లడంతో ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి అధికారంలోకి రాగానే రద్దుచేస్తామని చెప్పారన్నారు. ఈ మేరకు చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రజా వ్యతిరేకమైన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు పరుస్తూ సంతకం చేసి ప్రజల ఆస్తులకు రక్షణ తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జాన్ కెనడి, మాజీ ఉపాధ్యక్షుడు జింకా సుబ్బరాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు నాగేశ్వర రాజు, నిరంజన్‌కుమార్, గౌతం, ఎల్.శివశంకర్‌రెడ్డి, ఎం.బాషా, పి.గంగిరెడ్డి, రమేశ్, సురేశ్, శంకర్, బాలాజీ, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.


సరికొత్త హంగులతో జోయాలుక్కాస్

కడప (మారుతీనగర్), జూన్ 14: కడప ఆర్టీసీ బస్టాండు సమీపంలో పది సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన జోయాలుక్కాస్ షోరూంను శుక్రవారం సరికొత్త హంగులతో తిరిగి పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ సురేశ్‌బాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అధునాతన డిజైన్లతో మహిళలను విశేషంగా ఆకట్టుకుంటూ జోయాలుక్కాస్ ప్రపంచవ్యాప్తంగా 160 షోరూంలను ఏర్పాటు చేసిందన్నారు. మన రాష్ట్రంలో సుమారు 70 శాతం మంది ప్రజలు జోయాలుక్కాస్ షోరూంలోనే బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారన్నారు. అంతగా తెలుగు ప్రజల ఆదరాభిమానాలను జోయాలుక్కాస్ బంగారం చూరగొన్నదన్నారు. ఆ ఉత్సాహంతో కడపలో రెండవ ఫ్లోర్‌లో కూడా వ్యాపారసముదాయం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం జోయాలుక్కాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ థామస్‌మాథ్యు మాట్లాడుతూ తమ షోరూంలో గోల్డ్ డైమండ్స్, సిల్వర్ జ్యువెలరీ, మిగతా అన్ని మజూరీ చార్జీలపై ఫ్లాట్ 50 శాతం ప్రారంభోత్సవపు డిస్కౌంట్ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రత్యేక ఆఫర్ జులై 14 వరకూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సినీ నటి పసుపులేటి రేష్మ, జోయాలుక్కాస్ సీఓఓ హెన్రీజార్జి, రీటైల్ మేనేజర్ రాజేశ్‌క్రిష్ణన్, మార్కెటింగ్ డీజీఎం అనిశ్‌వార్గెష్‌తో పాటు పలువురు సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.



జోయాలుక్కాస్ షోరూం పునఃప్రారంభోత్సవ దృశ్యం

పాపం.. ఆ నేతలు



- ఎన్నికలకు ముందు టీడీపీ నుంచి వైసీపీలో చేరిక
- సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి సునామీ
- ఇప్పుడు అంతర్మథనం

రాజకీయాల్లో హత్యలు ఉండవు, ఆత్మహత్యలే ఉంటాయంటారు.. సరైన టైంలో సరైన నిర్ణయం తీసుకుని ఎన్నికల సమయంలో వ్యూహాత్మకంగా అడుగులు వేయకపోతే ఒక్కసారిగా అప్పటిదాకా ఉన్న రాజకీయ కెరీర్ అంతా తల్లకిందులవుతుంటుంది. ఆచి తూచి అడుగులు వేయకపోతే రాజకీయ భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారుతుందంటారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాలుగేళ్లపాటు పోరాడి.. సరిగా ఎన్నికల టైంలో కొందరు టీడీపీని వీడి వైసీపీలోకి జంప్ అయ్యారు. కొన్ని కారణాలతో విధిలేని పరిస్థితుల్లో కొందరు పార్టీ మారితే.. టికెట్ రాలేదని కొందరు, పార్టీలో ఉన్నా గుర్తింపులేదని కొందరు మారారు. వచ్చేది మళ్లీ వైసీపీ అనే నమ్మకంతో కొందరు సైకిలు దిగేశారు. ఇప్పుడు టీడీపీ రికార్డు స్థాయిలో కడప పార్లమెంటు పరిధిలో ఐదుస్థానాలు గెలుచుకుంది. దీంతో పార్టీ మారిన వారి గురించి వారి అనుచరులు అయ్యో పాపం అంటూ సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. - (కడప-ఆంధ్రజ్యోతి)

పాపం రమేశ్‌రెడ్డి



లక్కిరెడ్డిపల్లెకు చెందిన మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేశ్‌కుమార్‌రెడ్డి రాయచోటి టీడీపీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఈయన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డికి స్వయాన అన్న. 2019 లోనూ ఈయన రాయచోటి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. చాలా ఏళ్లుగా టీడీపీనే అంటిపెట్టుకుని ఉన్నారు. ఈ పర్యాయం ఏడేళ్లుగా ప్రతి పల్లె తిరిగారు. అయితే అసెంబ్లీని టికెట్‌ను కొన్ని పరిస్థితుల కారణంగా మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి కేటాయించారు. దీంతో మనస్తాపానికి గురైన రమేశ్‌రెడ్డి వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారు. అయితే ఆయన బలపరిచిన రాయచోటి వైసీపీ ఎమ్మెల్యే ఓడిపోయారు. కాగా.. రమేశ్ రెడ్డి మరదలు ఆర్.మాధవీరెడ్డి కడప టీడీపీ అభ్యర్థిగా గెలుపొందడం గమనార్హం.

సతీష్‌రెడ్డి



పులివెందుల నియోజక వర్గం వేంపల్లెకు చెందిన సతీష్‌రెడ్డి టీడీపీ హయాంలో ఓ వెలుగు వెలిగారు. 2019 వరకు ఎన్నికల్లో వైఎస్ కుటుంబంపై పోటీ చేస్తూ వచ్చారు. 2014-19 చంద్రబాబు పాలనలో సతీష్‌రెడ్డికి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. అయితే 2019 ఎన్నికల తరువాత సతీష్‌రెడ్డి సైలెంట్ అయ్యారు. 2024 ఎన్నికల ముందు వైసీపి వైపు అడుగులు వేస్తుండగా టీడీపీలో ఉండాల్సిందిగా మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, మరికొందరు టీడీపీ నేతలు మంతనాలు చేశారు. అయితే ఆయన టీడీపీని వీడి జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి, జగన్ గెలుపు కోసం ముమ్మరంగా ప్రచారం చేశారు. అవినాశ్‌రెడ్డి, జగన్ గెలిచినా.. ఇప్పుడు అధికార మార్పిడి జరగడంతో సతీష్‌రెడ్డికి ఫలితం మాత్రం దక్కలేదు.

వెంకటరెడ్డి

కాశినాయన మండలం నరసాపురానికి చెందిన వెంకటరెడ్డి టీడీపీలో చురుగ్గా ఉండేవారు. ఎన్నికలకు రెండురోజుల ముందు కూడా కూటమి అభ్యర్థుల కోసం ప్రచారం నిర్వహించారు. అయితే ఉన్నట్లుండి వైసీపీకి జంప్ అయ్యారు. అయితే వీరంతా వైసీపీ వస్తుందనుకుని బలంగా నమ్మారు. అధికారంలోకి టీడీపీ రావడంతో వారి అనుచరులు అయ్యో.. అయ్యో.. అయ్యయ్యో అంటూ కాలం గడుపుతున్నారు.

వీరశివారెడ్డి



కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి రూటే వేరు. కరెక్ట్‌గా రెండు నెలల వ్యవధిలోనే రెండుసార్లు పార్టీ మారారు. జనవరి చివరి వారంలో వీరశివారెడ్డి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. కమలాపురం టికెట్ ఆశించారు. టికెట్ రాకపోవడంతో తిరిగి వైసీపీలోకి పోయారు.

సాయినాధశర్మ



కమలాపురానికి చెందిన సాయినాధశర్మ టీడీపీలో కీలకంగా ఉన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగారు. కరోనా సమయంలో పేదలకు అన్నదానాలు చేశారు. లోకేశ్ కోసం పాదయాత్ర చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలకు సొంత డబ్బులతో ఉచిత బీమా సౌకర్యం కల్పించేందుకు పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేశారు. సర్వరాయసాగర్ పూర్తి చేయాలంటూ రైతులకు మద్దతుగా పాదయాత్ర చేశారు. అయితే ఎన్నికల ముందు వైసీపీలో చేరారు.

రెడ్యం వెంకటసుబ్బారెడ్డి



టీడీపీ ఆవిర్భావం నుంచి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి టీడీపీలో చురుగ్గా ఉండేవారు. రాష్ట్రకార్యనిర్వాహ కార్యదర్శిగా చాలా కాలం కొనసాగారు. టీడీపీ అధికారంలో ఉన్న 2014-2019 సమయంలో ఆయనను చంద్రబాబు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పదవి ఇచ్చారు. ఏడాది క్రితం కొన్ని కారణాల వలన ఆయనను రాష్ట్ర కార్యర్వాహక కార్యదర్శి పదవి నుంచి అధిష్టానం తప్పించింది. దీంతో అసంతృప్తికి గురైన ఆయన ఎన్నికలకు ముందు వైసీపీలో జాయిన్ అయ్యారు.

క్రషర్ మిషన్‌పై మైనింగ్ అధికారుల దాడి

● అక్రమంగా నడుపుతున్నారు : మైనింగ్ అధికారులు

● క్రషర్ మిషన్ ప్రాంతంలోని గదుల సీజ్


క్రషర్‌మిషన్ ప్రాంతంలో గనులశాఖ అధికారులు - గదులకు సీజ్ చేసిన దృశ్యం

ముద్దనూరు జూన్14: మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మేనమామ మునిరాజారెడ్డికి చెందిన రాయి తవ్వకం పొలం సహా క్రషర్ మిషన్‌ను శుక్రవారం జిల్లా గనులశాఖాధికారులు సీజ్ చేశారు. జిల్లా గనులశాఖాధికారి ఏడీ రవిప్రసాద్ సమాచారం మేరకు వివరాల్లోకెళితే.. మునిరాజారెడ్డి అక్రమంగా ఓబులాపురం, దేనేపల్లి ప్రాంత పొలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా రాయి తవ్వుతున్నారన్నారు. అలాగే శ్రీశ్రీనివాస మెటల్ సప్లయర్స్ క్రషర్‌ను కూడా ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారన్నారు. దీనికి సంబంధించి పరిశీలించామన్నారు. పొలాల్లో రాయి కోసం తవ్విన గుంతలను కొలతలు వేశామన్నారు. ఎర్రగుంట్ల రోడ్డులోని స్టోన్ క్రషర్ వద్ద నిల్వ చేసిన కంకరను కొలతలు వేశామన్నారు. దీనికి క్రషర్ మిషన్ ప్రాంతం గదులను వీఆర్వోతో పంచనామా చేయించి సీజ్ చేశామన్నారు. ఏపీ గనులు, ఖనిజాల చట్టం 1966, 2017 ప్రకారం తగు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు సువర్ణాదేవి రెవెన్యూ సిబ్బంది, జిల్లా గనులశాఖ కార్యాలయం అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి అడవిలో శవమై...

అనుమానిస్తున్న కుటుంబ సభ్యులు


చెట్టుకు వేలాడుతున్న సుదర్శన్ మృతదేహం - (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

లక్కిరెడ్డిపల్లె జూన్ 14: సుమారు 18 రోజులుగా కనిపించని చిన్నకొండు సుదర్శన్ (40) శవమై అడవిలో చెట్టుకు వేలాడుతుండడాన్ని గొర్రెల కాపరులు గుర్తించారని పోలీసులు తెలిపారు. వివరాల్లోకెళితే.... పాశెం పంచాయితీ బుర్జుపల్లె వాసి చిన్నకొండు సుదర్శన్ 18 రోజుల కిందట బుర్జుపల్లె సమీప శేషాచలం అడవుల్లోకి వేటకు వెళ్లాడు. కుటుంబీకులు రాత్రి వరకు ఎదురు చూశారు. మరుసటి రోజున కూడా వేచి చూసి చివరికి జూన్1వ తేదీన లక్కిరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల అనంతరం కన్పించక పోవడంతో ఎవరో చంపిఉంటారని కుటుంబీకులు అనుమానించారు. దీంతో వేటకు జతగావెళ్లిన వారిని పోలీసులు విచారించినా ఆచూకీ లభించక పోవడంతో అనుమానం మరింత ఎక్కువైంది. శుక్రవారం మనమోతలగుట్ట సమీపంలో చెట్టుకు వేలాడుతున్న సుదర్శన్ మృతదేహాన్ని గొర్రెలకాపరులు గుర్తించి బంధువులకు తెలిపారు. వెంటనే పోలీసులు, బంధువులు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఎవరో చంపి అడవిలోకి తీసుకెళ్లి చెట్టుకు ఉరివేశారని మృతుని భార్య శివమ్మ, కుమారుడు వంశీ ఆరోపిస్తున్నారు. మృతుని కాళ్ల కాలినట్లు ఉండడాన్ని గుర్తించిన కుటుంబీకులు పలు విధాలుగా ఆరోపిస్తున్నారు. అయితే ఎవరో ఎక్కడో చంపి ఇక్కడికి తెచ్చి ఉరివేశారా... లేక ఆయనే ఉరివేసుకున్నాడా తేలాల్సి ఉందని ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. ఏదేమైనా పోస్టుమార్టంలో తేలుతుందని పోలీసులు తెలిపారు.

మా అన్నను హత్య చేశారు : కుటుంబీకులు

చిన్నకొండు సుదర్శన్‌ను కొందరు గ్రామస్తులే హత్యచేసి కొండల్లో ఉరేశారని మృతుని తమ్ముడు వీరనారాయణ, భార్య శివమ్మ అనుమానించారు. వారు విలేకర్లతో మాట్లాడుతూ పాశెంగొల్లపల్లె, చిన్నపోతులపల్లె వాసులు రెడ్డెన్న, భాస్కర్, ఓబులేసు, ఈశ్వరయ్య, చాన్‌తో కలసి మేనెల 28న అడవికి వెల్లారు. 18 రోజులైనా ఆచూకీ తెలియడం లేదని వెంటవెళ్లిన వారే చంపి ఉంటారని వారు వివరించారు. ఈ విషయమై పోలీసులు పట్టించుకోవడంలేదని, అనుమానితుల పేర్లు పోలీసులకు చెప్పినా విచారించడం లేదన్నారు. ఈవిషయం పూర్తిగా తేలే వరకూ శవాన్ని పూడ్చనీయమన్నారు. పోలీసులు మాకు న్యాయం చేయలేదని, న్యాయం జరిగే వరకూ అంత్యక్రియలు చేయమన్నారు. ఈ విషయంపై ఎస్ఐ విష్ణువర్ధన్ వివరణ కోరగా పోస్టుమార్టంలో హత్యగా తేలితే అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు.

కూటి కోసం వచ్చి....

లారీ డ్రైవర్ మృతి ● సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు


శ్రీనివాసులు మృతదేహం

సుండుపల్లె, జూన్14: కూటి కోసం ఊరు కాని ఊరికి వచ్చిన నంద్యాల జిల్లా ఔకు మండల వాసి కే. శ్రీనివాసులు (35) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న శ్రీనివాసులు లారీలో సిమెంటు బస్తాలు వేసుకుని సుండుపల్లెకు వచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున రాయవరం ప్రధాన రహదారి ఈదులవంక బ్రిడ్జి సమీపంలో సిమెంటు లారీ పైన పట్ట తీస్తుండగా పైనుంచి పడి మృతి చెందినట్లు తెలిపారు. విద్యుత్ తీగలు తగిలి పడ్డాడా లేక పట్టు తప్పి కింద పడ్డాడా అని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయం పోస్టుమార్టం అనంతరం తెలుస్తుందని పోలీసులు తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు, భార్య, తల్లిదండ్రులున్నారు. మృతుడి తండ్రి వెంకటసుబ్బయ్య ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రక్తదానంతో పునర్జన్మ

ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో స్టెప్ సీఈఓ సాయిగ్రేస్

కడప (మారుతీనగర్) జూన్ 14: తల్లి జన్మ మాత్రమే ఇస్తుందని, ఏదేని ప్రమాదంలో గాయపడిన బాధితులకు రక్తదానంతో పునర్జన్మ ప్రాప్తిస్తుందని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జైభారత్ వీర శివాజీ ది ఫ్రిజర్వేటర్ సేవా సమితి (జేబీవీఎస్), సమారిటన్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్‌లో ప్రత్యేక రక్తదానశిబిరం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ఎందరో తలసేమియా బాధితులు, గర్భిణులు రక్తం కొరతతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి నడుం బిగించాలన్నారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ మాతృమూర్తి జన్మనిస్తే రక్తదాతలు పునర్జన్మ నిస్తున్నారని, కావున అలాంటి పుణ్యకార్యంలో యువత భాగస్వామ్యమై కనీసం ఏడాదికి మూడు సార్లయినా రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య అధికారి రవిబాబు, ఎయిడ్స్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ భాస్కర్, రిమ్స్ బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ రాజేంద్ర, సమితి జాయింట్ సెక్రటరీ విజయ్, సభ్యులు సురేంద్ర, వరప్రసాద్, శ్రీకాంత్‌తో పాటుగా పలువురు రక్తదాతలు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించాలి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 14: ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు సహకరించాలని విశ్రాంత పాఠశాల విద్య అడిషనల్ డైరెక్టరు వీరభద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరం ఆర్ట్స్ కళాశాలలో కళాశాల ప్లాటినం జూబ్లీ సన్నాహక సమావేశంలో విశ్రాంత ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ విద్యార్థులను గతంలో ఈ కళాశాల ఎంతగానో చైతన్యపరచి వారి వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దిందన్నారు. విద్యార్థులు స్వయంకృషితో ఎదగాలని కోరారు. అనంతరం కళాశాలలో చదివి అధ్యాపకులుగా పనిచేసిన ఎంసీ వెంకటసుబ్బయ్య, రఘునాథరెడ్డి, వై.చెన్నారెడ్డి, గోవిందరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ఎస్ఎం బాషా, సరస్వతి, వెంకటసుబ్బయ్య జయప్రకాశ్‌ను సన్మానించారు. సెప్టెంబరు 14, 15, 16 తేదీల్లో జరిగే కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలకు దేశవ్యాప్తంగా ఉన్న కళాశాల పూర్వవిద్యార్థులంతా హాజరవాలని, పూర్వవిద్యార్థుల కమిటీ కోరింది. ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, పూర్వవిద్యార్థుల కార్యదర్శి కె.శివరాం, ప్రోగ్రాం కో ఆర్డినేటరు రాజశేఖర్‌రెడ్డి, టీపీడీపీ కార్యదర్శి లయన్ చిన్నపరెడ్డి, పోతుల వెంకట్రామిరెడ్డి, జనార్ధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థుల కమిటీ ప్రతినిధులు

తాగునీటి సరఫరా అస్తవ్యస్తం

● ఇష్టారాజ్యంగా సిబ్బంది వ్యవహారం ● చేతివాటం ప్రదర్శిస్తున్న వైనం

● నీటికి పొంతనలేని లెక్కలు ● ఎర్రగుంట్లలో ఒక్కో వీధికి ఒక్కోరకంగా తాగునీటి సరఫరా


కడప రోడ్డులోని సంప్

ఎర్రగుంట్ల, జూన్ 14: ఎర్రగుంట్లలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. పెన్నా, కమలాపురం నదుల స్కీం ద్వారా వస్తున్న నీటికి, సరఫరా అవుతున్న నీటికి అసలు పొంతనలేకుండా ఉంది. కొందరు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవరిస్తుండడంతో తాగునీటి సరఫరా ఒక్కోవీధిలో ఒక్కోరకంగా ఉంది. ఒక వీధికి రోజూ నీరు వస్తుంటే మరో వీధికి రెండు, మూడు రోజులకు, మరికొన్ని వీధులకు వారం, పదిరోజులకు మాత్రమే తాగునీరు సరఫరా అవుతోంది. గతంలో నెలకు రెండు సార్లు మాత్రమే తాగునీరు వచ్చిన సంఘటనలూ లేకపోలేదు. ఈ వ్యత్యాసాన్ని తగ్గించే ప్రయత్నాలు చేసే అధికారులకు కొందరు సిబ్బంది తమ పలుకుబడి, చాకచక్యం ఉపయోగించి చుక్కలు చూపిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన ఓ అధికారి స్వలాభం చూసుకుని ఎర్రగుంట్ల నగర పంచాయతీని భ్రష్టుపట్టించారని, సిబ్బందిపై పూర్తిగా పట్టుకోల్పోయి ప్రజలకు మౌలిక సదుపాయలు కల్పించడంలో విఫలమయ్యారని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. తాగునీరు రావడం లేదని, కలుషితమౌతున్నాయని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని, కనీసం వీధుల్లోకి తొంగిచూడలేదనే విమర్శలున్నాయి. కొందరు అధికారులకు సిబ్బంది సహకరించడంతో మిగిలిన వారు లెక్కలేని తనం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొందరు సిబ్బందితో రిపేరీ ఖర్చులు లక్షల్లో మింగేశారని కౌన్సిల్ సమావేశాల్లో విమర్శించారు.

● ఎర్రగుంట్లకు పెన్నా నది నుంచి అయ్యప్ప స్వామి గుడి వెనకున్న బోర్ పాయింట్స్ నుంచి, రామాంజనేయపురం ఫిల్టర్ పాయింట్ నుంచి రెండు ప్రధాన పైప్‌లైన్ల గుండా నీటి సరఫరా అవుతోంది. ఈ నీరంతా రాణీవనం సంప్‌కు పంపింగ్ చేస్తున్నారు. ఎలాంటి అటంకాలు లేకపోతే రోజూ రెండు ఎంఎల్‌డీ నీరు ఇక్కడికి చేరుతుంది. కమలాపురం నుంచి ఏర్పాటు చేసిన పైప్‌లైన్ ద్వారా ఎర్రగుంట్ల కడప రోడ్డులో ఏర్పాటు చేసిన సంప్‌కు కనెక్షన్ ఇచ్చారు. ఎలాంటి ఆటంకాలు లేకపోతే ఇక్కడి నుంచి రోజుకు సుమారు 0.6ఎంఎల్‌డీ నీరు వస్తోంది. అంటే మొత్తానికి తాగునీరు పెన్నా, కమలాపురం నుంచి రోజుకు 2.5 ఎంఎల్‌డీ నీరు ఎర్రగుంట్లకు చేరుతోంది.

రోజుకు 4ఎంఎల్‌డీల నీరు అవసరం

ఎర్రగుంట్ల జనాభా అవసరాలకు రోజుకు 4ఎంఎల్‌డీల నీరు అవసరం. అయితే తాగునీరు ద్వారా 2.5ఎంఎల్‌డీ నీరు వస్తోంది. మిగతా నీరు ఎర్రగుంట్ల నగర పంచాయతీలో ఏర్పాటు చేసిన 46మినీ బోర్ స్కీంల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. వీటికి కరెంటు బిల్లులు భారీగా వస్తున్నట్లు సమాచారం. చాలా ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా రాకపోవడం, మరికొన్ని చోట్ల లాంగ్ పైప్ లైన్, ఏరియా ఉండడంతో 24గంటల పంపింగ్ అవసరముందని తెలుస్తోంది. చాలా చోట్ల 24 గంటల బోర్ పంపింగ్ అవసరం లేకపోయినా ఆడిస్తుండడం, సరైన నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడంతో కరెంటు బిల్లులు ఎక్కువగా వస్తోందన్న విమర్శలున్నాయి. ఇది నగరపంచాయతీకి మోయలేని భారంగా మారుతోంది.

● రాణీవనంలో పదిలక్షల కెపాసిటీ గల ఈఎస్ఎల్ఆర్ నిర్మించారు. సంప్ నుంచి ఈ ట్యాంక్‌ను నింపి రాణీవనం, ప్రకాష్‌నగర్, వినాయక నగర్, సుందరయ్యనగర్‌కు నీరు వదులుతున్నారు. ఓ వీధికి డైరెక్టు కనెక్షన్ ద్వారా కూడా నీరు వదులుతున్నట్లు సమాచారం. వినాయకనగర్ ఆర్‌ఓబీ వద్ద మరో ట్యాంకు కూడా ఉంది. అయితే ఈ వీధులకు బోర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు ఎక్కడా ఇప్పటి వరకు బోర్లు వేయకపోవడం గమనార్హం. అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యానికి నిలువుటద్దాలుగా నిలుస్తున్నాయి. రాణీవనం సంప్ నుంచి రెండు పంపుల ద్వారా కడపరోడ్డులోని సంప్‌కు, నడివూరులోని ట్యాంక్‌కు నీరు పం పింగ్ చేస్తారు. అయితే వీటికి బ్రేక్ పడుతున్నట్లు సమాచారం. కడప రోడ్డు సంప్ వద్ద ట్యాంక్ నుంచి మహేశ్వరనగర్, క్రాంతిగనర్, వేంపల్లిరోడ్డు ప్రాంతాలకు నీరు వదులుతున్నారు. నడివూరు ట్యాంక్ ద్వారా ఆరు వంతులు వదులుతున్నారు.

సగం జనాభా ఇక్కడే....

అయితే పాత నగరపంచాయతీ కార్యాలయం వద్దనున్న ట్యాంక్ నుంచి 9వ వార్డు నుంచి 18వ వార్డు వరకు నీటి వంతులున్నాయి. 1.20లక్షల లీటర్ల కెపాసిటీ ఉన్న ఈ ట్యాంకుకు సుమారు 13వంతులు (సుమారు 20వేల జనాభా కలిగి 60వీధులు). 20వార్డులో సగం వార్డుల వంతులు న్న ఈ ట్యాంకు కు మాత్రం తాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదు. దీంతో రోజుకు ఒకటి, రెండు సార్లు నిండితే గగన మే. ఇలా 13వంతులున్న ఈ ట్యాంకు పరిధి వీధులకు తాగునీరు మాత్రం 6 నుంచి 10రోజులు పడుతోంది. అది కూడా ఎలాంటి అటంకాలు లేకపోతేనే. లేదంటే తాగునీరు ఎప్పుడు వస్తుందో చెప్పలేమని ప్రజలు వాపోతున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా నగర పంచాయతీకి తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం. ఈవిషయమై ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మొదటి రోజునుంచే చర్యలకు ఉపక్రమించి అధికారులకు సూచనలు చేశారు. నిధులపై కూడా ఆయన హామీ ఇచ్చి చర్యలు తీసుకోమని చెప్పడం గమనార్హం.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిపెట్టాం

ఎర్రగుంట్ల నగర పంచాయతీలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాము. పెన్నా, కమలాపురం నుంచి వచ్చే నీటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాము. ఒక్కోవీధికి ఒక్కోరకంగా నీరు వస్తున్న మాట వాస్తమన్నారు. పాత నగరపంచాయితీ కార్యాలయం వద్ద నున్న ట్యాంకుపై ఎక్కువ వంతులున్నాయి. సంప్‌ల నుంచి నీరు ఇక్కడికి సక్రమంగా రాకపోవడాన్ని గమనించాము, వీటిని సరిదిద్దుతాం. కమలాపురం నుంచి మరింత నీటిని తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నాము. ట్యాంకులకు నీటిని ఎక్కించి వీధులకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాము. రాణీవనం, ప్రకాష్‌నగర్, వినాయకనగర్‌లకు బోర్లు వేసి రోజూ నీటిని ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపాము. సంప్‌ల నుంచి నీటి వినియోగంపై నిశితంగా పరిశీలిస్తున్నాము.

రామక్రిష్ణయ్య, కమిషనర్,
ఎర్రగుంట్ల నగర పంచాయతీ

ఆటో బోల్తా - ఉపాధి కూలీకి గాయాలు


గాయపడిన కూలితో మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఏపీఓ

వల్లూరు, జూన్ 14: తోళ్లగంగనపల్లె పంచాయతీలో ఉపాధి కూలీలు ప్రయాణిస్తున్న ఆటో బోల్తాపడడంతో కూలీలకు గాయాలైనట్లు ఎంపీడీఓ, ఏపీఓ సుధారాణి తెలిపారు. వారు ఇచ్చిన వివరాల మేరకు నల్లపురెడ్డిపల్లెకు చెందిన ఉపాధి కూలీలు పనిచేసేందుకు ఆటోలో వెళుతుండగా ఆటో బోల్తాపడింది. ఇందులో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కడపకు తరలించామన్నారు. విషయం తెలిసిన వెంటనే ఎంపీడీఓ, ఏపీఓ కడప రిమ్స్‌కు వెళ్లి పరామర్శించి, వైద్యులతో మాట్లాడారు. ఆటోలో 13 మంది కూలీలు ఉన్నారని వారిలో ముగ్గురికే గాయాలవడంతో ఊపిరి పీల్చుకున్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గాయాలపాలైన కూలీలకు న్యాయం జరిగేలా చూస్తామని వారు తెలిపారు.

రైల్వేట్రాక్ నడుమ గుర్తు తెలియని వ్యక్తి మృతి


రైల్వేట్రాక్ పక్కన గుర్తు తెలియని శవం

రాజంపేట, జూన్ 14: రాజంపేట - హస్తవరం రైల్వేస్టేషన్ల మధ్య రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి చనిపోయినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆకుపచ్చ చొక్కా పైన ఎర్ర, నల్లని చారలు కలిగిన వ్యక్తి ట్రాక్ పక్కనే మృతి చెందాడు. అటువైపు వెళుతున్న రేణిగుంట పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. వివరాలు తెలియరాలేదు.

వివాహిత ఆత్మహత్య

కలసపాడు, జూన్ 14: ఎగువరామాపురం వాసి అన్నవరం సుబ్బలక్షుమ్మ (45) అనారోగ్యంతో ఆత్మహత్య చేసు కున్నట్లు ఎస్ఐ నాగమురళి తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆమెకు కడుపు నొప్పి ఉండేదని, చికిత్స చేయించినా తగ్గకపోవడంతో ఆత్మహత్య చేసుకుందని మృతురాలి సోదరుడు నాగేశ్వర్‌రావు ఫిర్యాదు చేశారన్నారు. మృతురాలికి భర్త శ్రీనివాసులు, ఏడేళ్ల కుమార్తె ఉందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు హర్షణీయం

దస్తావేజు లేఖరుల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి వేణుగోపాల్

కడప (మారుతీనగర్) జూన్ 14: రాష్ట్రంలో కొలువుదీరిన ఎన్‌డీఏ ఉమ్మడి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది నిమిషాల్లోనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం హర్షణీయమని దస్తావేజు లేఖరుల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుంటి వేణుగోపాల్ పేర్కొన్నారు శుక్రవారం పాతరిమ్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా తీసుకొచ్చిన భూ యాజమాన్యం హక్కుచట్టం (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్) వలన రాష్ట్ర ప్రజానీకం వారి తాలూకు ఆస్తులపై అభద్రతాభావానికి గురయ్యారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టంలో పొందుపరచిన అనేక నిబంధనలు రాజ్యాంగానికి విరుద్ధంగా వున్నాయని, స్థిరాస్థిదారులు ఆ నిబంధనలు చూసి ఆస్తులు కోల్పోతామని ఆవేదన చెందారన్నారు. కాగా ఆ చట్టాన్ని రద్దుపరచాలని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రాజకీయపక్షాలు, ప్రజాసంఘాలు పలు రూపాల్లో సుదీర్ఘకాలం గత ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ప్రజా ఆందోళనలు దృష్టిలో వుంచుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండో సంతకంతో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారన్నారు. సమితి జిల్లా నేతలు యు. సం.జీవరాయుడు, రామకృష్ణారెడ్డి, ఓబులేసు, లోకనాథం, సుబ్బరాయుడు, సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక వత్తిడిలో పోలీసులు

వేధిస్తున్న సిబ్బంది కొరత ● కలగా మారిన వారాంతపు సెలవులు

● పనిభారం, రాజకీయ వత్తిడితో నలిగిపోతున్న నాలుగో సింహం



కడప (క్రైం), జూన్ 14: 'కనిపించే మూడు సింహాలు చట్టానికి, న్యాయానికి ధర్మానికి ప్రతీకగా అయితే కనిపించని నాలుగో సింహమేరా ఈ పోలీస్..' అంటూ సినిమాలో డైలాగ్‌లకే పరిమితమైంది. నిజ జీవితంలో అధికార పార్టీకి అండగా ఉంటున్నారు. ఖద్దర్ నేతలు ఆదేశిస్తుంటే ఖాకీలు పాటిస్తున్నట్లు కనిపిస్తుంటోంది. సిబ్బంది కొరత కారణంగా పడిన వారికి డ్యూటీలు వేసుకుంటూ వెళుతున్నారు. ధర్నాలు, బంద్‌లు, బందోబస్తుల్లో వీవీపీ డ్యూటీలు, శాంతిభద్రతల పర్యవేక్షణ, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతలు, మంత్రులు, సార్వత్రిక ఎన్నికలు ఇలా ఏదైనా ప్రభుత్వ కార్యక్రమాలకు పోలీసు బందోబస్తు తప్పనిసరిగా మారుతుంది. దీంతో విధి నిర్వహణలో పోలీసులు తీవ్రంగా మానసిక వత్తిడిలో నలిగిపోతున్నారు. కనీసం వారాంతపు సెలవులంటూ తొలుత సీఎం ప్రకటించినా అది ఆచరణ శూన్యమేనని చెప్పవచ్చు. దీంతో వారికి విధులు మరింత భారమయ్యాయి. ఎస్పీ మొదలు హెడ్ కానిస్టేబుల్ వరకు సిబ్బంది ఉన్నా కానిస్టేబుల్‌లో మాత్రం వేధింపు స్పష్టంగా కనిపిస్తోందనే బహిరంగరహస్యమే. పోలీసు శాఖలో కానిస్టేబుల్ కీలకం ఒకరకంగా అధికార పర్యవేక్షణలో కానిస్టేబుల్ విధులు కీలకంగా మారుతుంది. డబుల్ డ్యూటీలతో అటు మానసిక ఇటు శారీరకంగా నలిగిపోతున్నారు. కడప జిల్లాను రెండు జిల్లాలుగా మారుస్తూ సిబ్బందిని కూడా కేటాయించారు. జగన్ సీఎం అయిన ఐదేళ్లలో కానిస్టేబుల్ ఎంపికలు జరగకపోవడం ఉన్న కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పించడంతో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉన్న సిబ్బంది రెండు మూడు డ్యూటీలు చేసుకుంటూ అనారోగ్యంతో సతమతమవుతున్నారు.

అమలు కాని వారాంతపు సెలవులు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రభుత్వం వచ్చిన వెంటనే కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐల వరకు వారాంతపు సెలవులు ఇస్తానంటూ ఆర్భాటంగా ప్రకటించారు. ఆ ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. వైసీపీ పాలనలో పోలీసులకు వారాంతపు సెలవులు కలగానే మిగిలిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం తమకు వారాంతపు సెలవులు ఇస్తే కుటుంబంతో కనీసం ఒక్కరోజైనా గడపవచ్చనే ఆనందం సిబ్బందిలో కన్పించింది. అవి అమలు కాకపోవడంతో వారిలో నిరాశే మిగిలింది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ఎస్పీ మొదలు కానిస్టేబుల్ వరకు పోలీసు విధులు నిర్వహిస్తున్నారు. అయితే కానిస్టేబుల్‌లో పూర్తి కొరత ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. వైఎస్ఆర్ జిల్లాలో 50 పోలీసుస్టేషన్‌లు, ఒక సీసీఎస్, ఒక దిశ, రెండు పీసీఆర్, పోలీసు ట్రైనింగ్ కేంద్రం, రెండు ఫ్యాక్షన్‌జోన్, ఐదు సబ్‌డివిజన్లు ఉన్నాయి. సివిల్ విభాగంలో దాదాపు 500, ఏఆర్ విభాగంలో 200 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది.

హోంగార్డు, మహిళా పోలీసు ఎంపికలతోనే సరి

జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ కేవలం జిల్లాలో హోంగార్డు ఎంపికలు, సచివాలయంలో మహిళా పోలీసుల ఎంపికలు జరిగాయి. కానిస్టేబుల్ నోటిఫికేషన్ విడుదల చేసినా ఎంపికలు జరగకపోవడంతో ఐదేళ్లలో ఒక కానిస్టేబుల్ ఎంపికలు జరగకపోవడం ఖాళీల సంఖ్య మరింత పెరిగింది.

చిరంజీవి యువత ఆధ్వర్యంలో రక్తదానం



రంజిత్‌కుమార్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న బ్లడ్‌బ్యాంకు స్పెషల్ అధికారి శివశంకర్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 14: ప్రపంచ బ్లడ్ డోనర్స్ డే సందర్భంగా అఖిలభారత కడప జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్లడ్‌బ్యాంకు స్పెషల్ అధికారి శివశంకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ అధికారి సాయిగ్రేసీ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన రాయలసీమ కో-కన్వీనరు పంద్ర రంజిత్ కుమార్ మాట్లాడుతూ చిరంజీవి స్ఫూర్తితో జిల్లావ్యాప్తంగా అనేక రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మెగా అభిమానులు, జన సైనికులు అబ్బన్నగారి రాజగోపాల్, రవికుమార్, ప్రసాద్, చంద్రశేఖర్, బాలాజీ, బాలునాయక్, కుమార్‌నాయక్, సుధీర్‌నాయక్, రాము, నవీన్, సురేశ్, సాయికిరణ్ పాల్గొన్నారు.

వేధింపుల నుంచి విముక్తి కల్పించండి

● ఆర్టీసీ కార్మిక పరిషత్ రీజనల్ కార్యదర్శి

కడప (మారుతీనగర్), జూన్ 14: ఆర్టీసీ కడప డిపోలో తమ యూనియన్ ఉద్యోగులపై డిపో అధికారుల వేధింపుల నుంచి విముక్తి కల్పించాలని ఆర్టీసీ కార్మిక పరిషత్ రీజనల్ కార్యదర్శి ఎం.పురుషోత్తం కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే మాధవీరెడ్డిని ఆమె నివాసంలో కలిసి సమస్యలను విన్నవించారు. కార్మిక పరిషత్ కడప డిపో గౌరవాధ్యక్షుడు చిట్టిబోయిన సుబ్బరాయుడు, డిపో కార్యదర్శి రాజారెడ్డి, అధ్యక్షుడు కిశోర్‌బాబు, న్యాయవాది సుధారాణి, మల్లికార్జున, శివశంకర్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో గ్రీన్ కడపగా తీర్చిదిద్దుదాం

● అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల ఏర్పాటు ● అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల గుర్తింపు ● ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 14 : 'కడప నగరాన్ని సమష్టి కృషితో గ్రీన్ కడపగా తీర్చిదిద్దుదాం' అని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలకనుకూలంగా మౌలిక వసతులు ఏర్పాటుచేయాలన్నారు. నగరంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి వాటికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. శుక్రవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అభివృద్ధికి సంబంధించి చర్చించారు. పెండింగులో ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప నగరం వైసీపీ ప్రభుత్వ హయాంలో అధ్వానంగా మారిందన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేశారన్నారు. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ చాలా అధ్వానంగా మారిందని, దాన్ని సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో ఒక కాలనీని మోడల్‌గా తీసుకుని దాన్ని తీర్చిదిద్దాలన్నారు. కడప నగరంలో ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు అడ్డదిడ్డంగా ఉన్నాయని, వాటిని సరిచేయాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణకు సంబంధించి పన్నులు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. టీడీపీ హయాంలో నిర్మాణమైన టిడ్కో ఇళ్లను త్వరలో లబ్ధిదారులకు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్లాన్ అప్రూవల్‌కు సంబంధించి ఇష్టానుసారంగా కాకుండా నిబంధనల ప్రకారం చేయాలన్నారు. కడపను సుందర నగరంగా తీర్చాల్సిన బాధ్యత అధికారులకు, పాలకులదేనన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారంజక పాలనే టీడీపీ ధ్యేయం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రమణ తదితరులు

వేంపల్లె, జూన్ 14: ప్రజలందరికీ మంచి చేస్తూ ప్రజారంజక పాలన అందించడమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి పి.వి రమణ తెలిపారు. నాలుగోసారి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీతో పాటు పింఛన్ తదితర ఐదు సంతకాలు చేయడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వేంపల్లెలో శుక్రవారం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సాయం అందిస్తూ జనరంజ కపాలన అందిస్తారన్నారు. అలాగే అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి పాటుపడతార న్నారు. పార్టీలకతీతంగా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధిపై ముందుకు సాగుతుందని తెలిపారు. దేవస్థాన మాజీ సభ్యురాలు నాగలక్ష్మి, మాజీ ఎంపీటీసీ చంటెన్న, టీడీపీ సీనియర్ నాయకులు నల్లమేకల రామస్వామి, రామాంజనేయులు, నాగశేఖర్, చావలి నగేష్, నాగముని, నరసింహులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకునే ఘనత టీడీపీదే

వల్లూరు, జూన్ 14: ఇచ్చిన మాట నిలబెట్టుకునే నైజం టీడీపీదేనని, అందుకే సీఎంగా చంద్రబాబునాయుడు బాధ్యతలు తీసుకున్న రోజునే హామీల అమలు మొదలుపెట్టారని వల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి అయిన తొలిరోజునే డీఎస్సీపై తొలిసంతకం పెట్టారని, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు ఇలా ప్రారంభించారన్నారు.

మంత్రివర్గ కూర్పులో జిల్లాకు అన్యాయం: తులసిరెడ్డి

కడప(కలెక్టరేట్), జూన్14:కేంద్రంలో, రాష్ట్రంలో మంత్రి వర్గ కూర్పులో కడప జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని మాజీ రాజ్యసభ సభ్యు డు, పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో అఫ్జల్‌ఖాన్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చం ద్రబాబు నాయుడు చేసిన ఐదు సంతకాలను కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తోందన్నారు. సంతకాలతో సరిపెట్టకుండా వాటిని వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో 2.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలుండగా అందులో మెగా డీఎస్సీ పేరుతో 16347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి ఫైల్‌పై సంతకం చేశారని, అన్ని శాఖల్లో మిగతా ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను కూడా భర్తీ చేయాలన్నారు. మోదీ మంత్రివర్గ కొలువుల్లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. 29 మంది ఎంపీలున్న మధ్యప్రదేశ్‌కు ఐదు మంత్రి పదవులు, 28 ఎంపీలున్నా కర్ణాటకకు ఐదు పదవులు, 26 మంది సభ్యులున్న గుజరాత్‌కు ఐదు మంత్రి పదవులు, 25 మంది ఎంపీలున్న రాజస్థాన్‌కు కూడా ఐదు కేంద్ర మంత్రి పదవులు దక్కగా 25 మంది పార్లమెంట్ సభ్యులు ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు కేవలం మూడు మంత్రి పదవులు మాత్రమే ఇవ్వడం ముమ్మాటికీ అన్యాయమేనన్నారు. మోదీ సర్కారు తెలుగుదేశం పార్టీ పట్ల చిన్న చూపునకు ఇది నిదర్శనమన్నారు. రాష్ట్ర మంత్రి వర్గ కూర్పులో కూడా కడప జిల్లాకు అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో 26 జిలాల్లు ఉన్నాయని, నిబంధనల ప్రకారం సీఎంతో కలిపి 26 మందికి పదవులు ఇవ్వ వచ్చన్నారు. అయితే చాలా ఏళ్ల తరువాత జిల్లాలో నాలుగు టీడీపీ, ఒక బీజేపీ గెలిచినా ఒక్కరికీ కూడా మంత్రి పదవి దక్కకపోవడం శోచనీయమన్నారు. కడప జిల్లాను ఉమ్మడి జిల్లాగా లెక్కించడం తగదన్నారు. కాగా అఫ్జల్‌ఖాన్ తక్కువ వ్యవధిలోనే కడప అసెంబ్లీకి పోటీ చేసి రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థుల్లో రెండవ స్థానంలో 24.500 ఓట్లు సాధించడం అభినందనీయమన్నారు.

మంచినీటి సరఫరా ప్రతిరోజు జరగాలి

పులివెందుల టౌన్, జూన్ 14: మున్సిపాలిటీలో ప్రతిరోజు మంచినీటి సరఫరా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలియజేశారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో కమిషనర్ పర్యటించారు. పైప్ లైన్ లీకేజీల ద్వారా నీటి వృథాను అరికట్టాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని మరింత మెరుగు పరచడానికి చర్యలు చేపట్టాలని అన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, టౌన్‌ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కడప (క్రైం), జూన్ 14 : టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిలను కడప జిల్లా పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ జిల్లా పోలీసు సిబ్బందికి ప్రభుత్వం తరపున రావాల్సిన బకాయిలను సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరగా వచ్చేలా చేస్తామన్నారు. పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబరు మాధవీలత, అసోసియేషన్ మెంబర్స్ రాచరాయుడు, సారాపతి, శేఖర్, క్రిష్ణ, అంజి, పుల్లయ్య, బ్రహ్మయ్య, నాగార్జున, లక్ష్మీదేవి, పెంచల్‌రాజు పాల్గొన్నారు.

పెన్షనర్లకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 14 : పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని, అలాగే పెన్షనర్లందరికీ అండగా ఉంటామని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. శుక్రవారం పాత కలెక్టరేట్ కార్యాలయంలో గల పెన్షనర్ల కార్యాలయంలో నూతనంగా ఎంపికైన ఎమ్మెల్యే మాధవీరెడ్డిని పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, గౌరవ అధ్యక్షుడు నాగమునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామమూర్తినాయుడు తమ సమస్యలను ఆమెకు వివరించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు హర్షణీయం

● బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు

కడప(రూరల్) జూన్ 14:ప్రజల ఆస్తులకు రక్షణలేని ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయడం హర్షణీయమని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.గుర్రప్పనాయుడు, ప్రధాన కార్యదర్శి జాన్ కెనడీ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీ డియా సమావేశంలో వారు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల ప్ర జల ఆస్తులకు రక్షణ కరువైందన్నారు. ఇలాంటి భయానక చ ట్టాన్ని రద్దుచేయాలని తగ వైసీపీ ప్రభుత్వాన్ని కోరుతూ న్యాయవాదులు ఆందోళనలు, ఉద్యమాలు చేసినప్పటికీ పట్టించులేదన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టగానే ఈ యాక్టును రద్దుపరచడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బక్రీదును ప్రశాంతంగా జరుపుకోండి

● మత పెద్దలకు ఎస్ఐ సూచన

సింహాద్రిపురం, జూన్ 14:బక్రీదు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ముస్లిం మత పెద్దలకు ఎస్ అనీల్‌కుమార్ సూచించారు. శుక్రవారం సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా ము స్లింలు మత సామరస్యం పాటిస్తూ ఎటువంటి గొడవల జోలికి వెళ్లకూడదన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ తెలిపారు. స్థానిక మూడు మసీదుల మత పెద్దలు, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న తులసిరెడ్డి, అఫ్జల్‌ఖాన్

కడప(కలెక్టరేట్), జూన్ 14: 'రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి' అంటూ కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి పాల్గొన్నారు. అన్ని దానాల్లో కల్లా రక్తదానం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మామిళ్ల నరసింహులు, అశోక్ రావు, యశ్వంత్, రషీద్ ఖాన్, సునీల్, వినయ్, శ్రీను, అఫ్జల్‌ఖాన్, సలాఉద్దీన్, శ్యామలాదేవి, అరుణ్, వీక్కీ, సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చక్రాయపేట, జూన్ 14: మండలంలోని చక్రాయపేట, మహదేవపల్లె, కె.రాజుపల్లె, కె.ఎర్రగుడి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో శనివారం ఉదయం 8:15గంటల నుంచి మధ్యాహ్నం 12.15గంటల వరకు విద్యుత్ ఉండదని విద్యుత్ శాఖ ఏఈఈ ప్రవీణకుమార్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చక్రాయపేట ఫీడర్‌లో మరమ్మత్తులు నిర్వహిస్తున్నందున ఈ అంతరాయం ఉంటుందని తెలిపారు.

డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 14:ప్రభుత్వ నిబంధనలు పాటించని వి ద్యాసంస్థల అనుమతులను రద్దు చేయాలని శుక్రవారం డీఈఓ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం వారు ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ జి ల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను కొత్తకొత్త పేర్లతో దోపిడీ చేస్తున్నారన్నారు. మార్కెట్ రేటు కన్నా ఆయా కళాశాలల్లో అధిక మొత్తంలో టెక్స్ట్ పుస్తకాలు, నోటు పుస్తకాలకు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.డీఈఓ, ఆర్ఐఓ దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కె.శివశంకర్, తేజా, రాజేష్, నిఖిల్, పీటర్, ప్రేమ్ పాల్గొన్నారు.

'ట్రిపుల్‌ఐటీ ఉద్యోగులకు న్యాయం చేయాలి'

వేంపల్లె,జూన్ 14: నోటిఫికేషన్ 2017-18లో నియామకమైన ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. కేవలం టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు తెచ్చుకున్నందుకు కక్షసాధింపు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడు సంవత్సరాలుగా చాలీచాలని తక్కువ వేతనంతో పనిచేస్తున్నారు. కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్న వారి వేతనాల్లో వ్యత్యాసం చూపడం ఆర్జీయూకేటీ అధికారుల పక్షపాత వైఖరికి నిదర్శనంగాఉంది. బయట పాలిటెక్నికల్, డిగ్రీ కళాశాలల్లో నెలకు రూ.60వేలు వేతనం ఇస్తున్న ట్రిపుల్‌ఐటీలో కేవలం రూ.30వేలకు అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని కోరుతున్నారు. దీనిపై సీఎం చంద్రబాబునాయుడు, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని కక్షసాధిస్తున్న ఆర్జీయూకేటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని, [illegible]

నిరుద్యోగ యువతకు పెద్దపీట: టీడీపీ

కమలాపురం రూరల్, జూన్ 14 : రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ తొలి సంతకం చేయడం నిరుద్యోగ యువతకు పెద్దపీట వేయడమేనని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, రైతు సంఘం నాయకుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు.

'రాష్ట్రంలో నవశకం ప్రారంభమైంది'

కాశినాయన .జూన్ 14: చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో రాష్ట్రంలో నవశకం ప్రారంభమైందని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 4వ సారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ఇచ్చిన మాటప్రకారం మెగా డీఎస్సీపై మొదటి సంతకంతోపాటు పెన్షన్‌ల పెంపు, అన్నకాంటీన్ల ప్రారంభం, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు తదితర 5 అంశాలపై మొదటిరోజు సంతకాలు చేయడంతో అన్ని వర్గాల ప్రజలనుండి హర్షాతిరేకాలు వ్యక్తమవు తున్నాయంటూ కొనియాడారు. ఈసమావేశంలో తెలుగు యువత అధ్యక్షుడు పంగా రవీంద్రారెడ్డిక్లస్టర్ ఇన్‌చార్జి మురుకూటి విజయ్‌కుమార్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బక్రీదును ప్రశాంతంగా జరుపుకోవాలి



పోరుమామిళ్లలో మాట్లాడుతున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

పోరుమామిళ్ల, జూన్ 14 : బక్రీదు పండగ ప్రశాంతంగా జరుపు కోవాలని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో శాంతికమిటీ సమావేశం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ బక్రీదు సందర్భంగా గోవధలాంటి కార్యక్రమాలు చేపడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా బక్రీదు వేడుకలు జరుపుకోవాలన్నారు.
కొండాపురం..: బక్రీద్ పండుగను సామరస్యంగా జరుపుకోవాలని కొండాపురం సీఐ వేణుగోపాల్ తెలిపారు.శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.పండగను శాంతియుతంగా జరుపుకునేందుకు అందరూ సహకరించాలన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లిం, క్రైస్తవులు సోదరభావంతో మెలగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ యోగీంద్ర, శాంతికమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక



శివనాగేశ్వరి, ఓబులేసు

చాపాడు, జూన్ 14: 2023-24 సంవత్సరానికి సంబంధించి నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్‌నకు మండలంలోని నరహరిపురం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శివనాగేశ్వరి, ఓబులేసు అనే విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ నరసింహశాస్త్రి పేర్కొన్నారు. గత ఏడాది అక్టోబరు నెలలో వీరు పరీక్షలు రాయగా ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. విద్యార్థులు 8వ తరగతి చదువుతున్నారు. వీరికి ఏడాదికి ఒక్కొక్కరికి రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ నాలుగేళ్లపాటు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను హెచ్‌ఎం నరసింహశాస్త్రి, ఉపాధ్యాయులు సురేంద్రబాబు, మురళి అభినందించారు.

ఘనంగా షిర్డిసాయిబాబా వార్షికోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 14: రూరల్ పరిధిలోని లింగాపురంలో ఉన్న షిర్డిసాయిబాబా ఆలయంలో 10వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభించి స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం సాయి సత్యవ్రతాలు, చందనోత్సవం, మధ్యాహ్నం హారతి పూజలు వంటి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని పురవీధులలో సాయినామస్మరణలతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో శ్రీ షిర్డిసాయి సేవాశ్రమం కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు ఘన సన్మానం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 14: కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ శరత్‌బాబు పదోన్నతిపై కడప రిమ్స్‌కు బదిలీ కావడంతో ఎన్జీవో అసోసియేషన్ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. శుక్రవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభినందన సభ నిర్వహించి సత్కరించారు. 23 సంవత్సరాలుగా కాంట్రాక్టు ఉద్యోగులుగా ఉండి రెగ్యులర్ ఉద్యోగులుగా మారిన శ్రీనివాసులు, శోభారాణి, కమలాక్షిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ కార్యదర్శి రామసుబ్బయ్య, మైదుకూరు తాలూకా అధ్యక్షుడు చంద్రమౌళి, మెడికల్ ఆఫీసర్లు శివప్రసాద్‌రెడ్డి, మహాలక్ష్మి, మునిరామప్రసాద్, ఉపాధ్యక్షుడు సీతారామానుజ, జాయింట్ సెక్రటరి రాజశేఖర్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడీలో అన్నప్రాసన

పోరుమామిళ్ల, జూన్ 14 : మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన నిర్వహించారు. శుక్రవారం 4వ అంగన్వాడీ కేంద్రపరిధిలో అంగన్వాడీ కార్యకర్త హబీబున్నీసా తన అంగన్వాడీ పరిధిలోని చిన్న పిల్లలకు వారి తల్లుల ద్వారా అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల తల్లులు పాల్గొన్నారు.

రక్తదాత ఆర్మీ మాజీ ఉద్యోగికి సన్మానం



హాజీవలిని సన్మానిస్తున్న దృశ్యం

కొండాపురం, జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా కొండాపురం పట్టణానికి చెందిన ఆర్మీ మాజీ ఉద్యోగి పీర్ల హాజీవలి ని అనంతపురంలో శుక్రవారం సన్మానించారు.రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనను మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి సన్మానించారు.69 సార్లు రక్తదానం చేయడంతో పాటు పలుమార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకు తనను సన్మానించినట్లు హాజీవలి తెలిపారు

ఘనంగా చేగువేర జయంతి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 14: చేగువేర జయంతిని పురస్కరించుకుని డీవైఎఫ్‌ఐ నాయకులు శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ క్యూబా విప్లవంలో చేగువేర కీలకపాత్ర పోషించారని తెలిపారు. డీవైఎఫ్‌ఐ పట్టణాధ్యక్షుడు వెంకటేష్, విశ్వనాథ్, అఖిల్, సన్ని తదితరులు పాల్గొన్నారు.

గండికోటప్రాజెక్టులో నిలకడగా నీటిమట్టం

కొండాపురం, జూన్14: గండికోటప్రాజెక్టులో ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో గాని లేకపోవడంతో నీటిమట్టం నిలకడగా ఉంది. శుక్రవారం ప్రాజెక్టులో 2.498 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు.ప్రస్తుతం గండికోట నుంచి ఇతర ప్రాజెక్టులకు నీరు వదలడం లేదని డీఈ తెలిపారు.

2029 నాటికి వైసీపీతో పాటు జగన్ కనుమరుగు

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు జూన్ 14 : 2029 నాటికి రాష్ట్రంలో వైసీపీతో పాటు జగన్ కూడా కనుమరుగవుతాడని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి జోస్యం చెప్పారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ నవరత్నాలే తనను గట్టెక్కిస్తాయని అభివృద్ధిని పూర్తిగా విస్మరించాడన్నారు. అందుకే 11 సీట్లకు పరిమితం అయ్యాడన్నారు. రాష్ట్రంలో టీడీపీ సంక్షేమం, అభివృద్ధి పాలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టాడన్నారు. అందులో భాగంగానే ఐదు సంతకాలలో మొదటి సంతకం మెగా డీఎస్సీ, రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, మూడో సంతకం 4వేల రూపాయల పెంచిన పెన్షన్, నాలుగు అన్న క్యాంటీన్లు, ప్రారంభం, ఐదు స్కిల్ కోర్సులను మొదలుపెట్టాడన్నారు. 18 తేదీ క్యాబినెట్ తరువాత సూపర్ సిక్స్ పథకాలు కూడా ప్రారంభం అవుతాయన్నారు. పోలవరం రెండేళ్ళలో పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీళ్ళు తీసుకొస్తారన్నారు. శ్రీశైలం నీళ్ళు రాయలసీమకు కేటాయిస్తారన్నారు. గత ప్రభుత్వం కక్షపూరిత చర్యలకు పాల్పడిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అలాంటి పాలన సాగించ దన్నారు.గత ప్రభుత్వంలో పెంచిపోషించిన మట్కా, క్రికెట్‌బెట్టింగ్, జూదం లాంటివి పూర్తిగా అరికడతామన్నారు. ప్రొద్దుటూరులో నిర్మించదలిచిన 23 వేల ఇళ్ళలో కనీసం వంద ఇళ్లు పూర్తికాలేదన్నారు. అక్కడ ఎవ్వరూ చేరలేదన్నారు. హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్ష జరిపామన్నారు. గత ప్రభుత్వంలో ఆర్థిక పరిస్థితి లేక బిల్లులు పెండింగ్‌లోవున్నాయన్నారు. ఆర్టీపీపీ వెళ్ళే మార్గంలో బ్రిడ్జి పనులు పెండింగ్‌లో వున్నాయన్నారు. 14 కోట్లు బిల్లులు రావాలన్నారు. అలాగే హౌసింగ్ లేవుట్‌లలో మౌలిక వసతులు కల్పన కోసం చేసిన పనులకు బిల్లులు కూడా పెండింగ్‌లో వున్నాయన్నారు. అసెంబ్లీ సమావేశాల నాటికి నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ వున్న బిల్లులకు నిధుల విడుదల కోసం కృషిచేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ మెగా డీఎస్సీ తొలిసంతకంతో నిరుద్యోగుల్లో చంద్రబాబు ఆశలు చిగురింప చేశారన్నారు. సంక్షేమం అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేసుకుని చంద్రబాబు పాలన జనరంజకం గా సాగుతుందన్నారు. సమావేశంలో మాజీ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మెన్ చౌడం వెంకట కొండయ్య, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి , మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, బోగా కల్యాణి తదితరులు పాల్గొన్నారు

పురందేశ్వరిని కలిసిన బొజ్జా రోశన్న

పోరుమామిళ్ల, జూన్ 14 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని బద్వేలు బీజేపీ నియోజకవర్గ నాయకుడు బొజ్జ రోశన్న కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం విజయవాడలో ఆయన తన కుటుంబ సభ్యులతో ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పుట్టాకు జోగులాంబ ప్రసాదం అందజేత



మైదుకూరు, జూన్ 14 : మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన పుట్టా సుధాకర్ యాదవ్‌కు జనసేన నాయకులు శక్తిపీఠమైన జోగులాంబ ప్రసాదాన్ని అందించారు. హైదరాబాదులోని ఆయన నివాసానికి కౌన్సిలర్ వాదనపల్లి బాబు ,జనసేన నాయకులు చిలుంగారి క్రిష్ణమూర్తి, రామగోవిందు, పుల్లయ్య, విశ్వేరయ్య చేరుకొని ప్రసాదం అందచేశారు. పాలన ఆమోదయోగ్యమైన పాలన ఉండాలని కోరారు.

అక్రమ కట్టడాలు ఉపేక్షించం

వార్డు ప్లానింగ్ సెక్రటరీల సమీక్ష సమావేశంలో - కమిషనర్ రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు ,జూన్ 14 : ప్రొద్దుటూరులో నిర్మాణమయ్యే అక్రమ కట్టడాలను ఉపేక్షించేది లేదని కమిషనర్ రఘునాథరెడ్డి వాటిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం ఆయన కమిషనర్‌చాంబర్‌లో వార్డుప్లానింగ్‌సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పట్టణంలో నిర్మాణమవుతున్న కట్టడాలు మున్సిపాలిటీఅనుమతి తీసుకుని ప్లానుప్రకారం కడుతున్నారాలేదా జాబితా తయారు చేయాలన్నారు. ఇప్పటి వరకు అక్రమ కట్టడాలకు ఇచ్చిన నోటీసుల గురించి ఆరాతీశారు. ఎన్నింటిపై చార్జ్ షీటుదాఖలు చేశారని ప్రశ్నించారు. అలాగే మున్సిపల్ స్థలాలు ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. అక్రమకట్టడాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామన్నారు. ఇదిలా వుండగా టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ మునిరత్నం కౌంటింగ్ ముగిసినప్పటి నుంచి మున్సిపల్ కార్యాలయానికి సక్రమంగా రావడంలేదని కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. ఈ సమావేశానికి కూడా కమిషనర్ రమ్మని ఆదేశిస్తే రాకుండా స్విచ్ ఆఫ్ చేసుకుని అందుబాటులోకి రాకుండా డుమ్మాకొట్టాడు.

18న సోమేశ్వరస్వామి దేవస్థానం భూముల వేలం

రాజుపాలెం, జూన్ 14 : మండల పరిధిలోని టంగుటూరు గ్రామానికి చెందిన సోమేశ్వర దేవాలయం 178.5 ఎకరాల భూములను కౌలుకు తీసుకునేందుకు 18న మంగళవారం ఉదయం 10గంటలకు వేలం వేస్తున్నట్లు ఈవో రామచంద్రాచార్యులు తెలిపారు. ఈ వేలంలో పాల్గొనేవారు ఏ విధమైన బాకీలు ఉన్నా లావాదేవీలు ఉన్నవారు కానీ వేలం పాటలో పాల్గొనేందుకు అనర్హులు. ఏ కారణం చేత అయినా వాయిదా వేసేందుకు నిలుపుదల చేసేందుకు కార్యనిర్వహణాధికారి పూర్తి అధికారం ఉందన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా 10వేలు డిపాజిట్ కట్టి పాటలో పాల్గొనాలన్నారు. హెచ్చు పాటదారుడు పాట మొత్తం చెల్లించిన యెడల వారికి ఈ పొలాన్ని ఒక సంవత్సరం కౌలుకు తీసుకునేందుకు అప్పగిస్తామన్నారు.ఏ విధమైన కారణాలచేత దానిని వాయదా వేసేందుకు కార్యనిర్వహణాధికారికి సర్వహక్కులు ఉన్నాయన్నారు.
దేవస్థాన చైర్మన్ రాజీనామా..: మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో వెలసిన సోమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ముక్కమల నరసింహారెడ్డి గురువారం తన చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు అధికారులు తెలిపారు. రాజీనామా పత్రాన్ని ఆలయ అధికారులకు అందించినట్లు వారు ప్రకటనలో తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



గ్రామస్థులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

ఖాజీపేట, జూన్ 14: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి నాగరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సుంకేసుల హరిజనవాడలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా ఫ్రైడే, డ్రైడే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, శోభన్‌బాబు, క్రిష్ణప్రియ, శివనాగమణి, భాస్కర్, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైకి వ్యర్థ నీటిని వదల వద్దు

గోపవరం, జూన్ 14 : ప్రజలు రోడ్లపైకి వ్యర్థ నీటిని వదల వద్దని ఎంపీడీవో రాధాక్రిష్ణ అన్నారు. మండలంలోని కాలవపల్లె గ్రామ పంచాయతీలో ఉన్న లక్కవారిపల్లెలో శుక్రవారం పారిశుధ్య కార్యక్రమాలు పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటిలో ఉపయోగించుకునే వ్యర్థ నీటిని రోడ్డుపైకి రాకుండా చూడాలని తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లోని కార్యదర్శులకు రోడ్డుపై వ్యర్థ నీటిని పంపించేవారిని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ షేక్ హసీనా, కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

కడప పేరును పునరుద్ధరించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 14: వైఎస్ఆర్ జిల్లా పేరును వైఎస్ఆర్ కడపజిల్లాగా మార్చాలని జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం ప్రభుత్వాన్ని కోరారు. వెంకటేశ్వరస్వామికి కడప తొలిగడపగా గుర్తింపు పొందిందన్నారు. 2022లో జిల్లాల పునర్విభజన సమయంలో పేరు మార్చాలని సూచించామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కడప పేరును పునరుద్ధరించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి



వీసీతో మాట్లాడుతున్న మాదాసు మురళి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 14: ప్రొద్దుటూరులోని వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అధ్యాపకులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జనసేన పార్టీ నాయకులు మాదాసు మురళి శుక్రవారం యోగివేమన యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ చింతసుధాకర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, యోగివేమన యూనివర్శిటీ రిజిస్ట్రార్‌లు జీవోనెం.110 అమలు చేయకుండా కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. కొంతమంది అధ్యాపకులకు రెండు సంవత్సరాల్లో పీహెచ్‌డీ పూర్తి చేసి సర్టిఫికెట్ అందించాలని, లేదంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని ప్రిన్సిపాల్, రిజిస్ట్రార్ బెదిరించడం దారుణన్నారు. వైస్‌ఛాన్సలర్ జోక్యం చేసుకుని కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు రాజశేఖర్, రవి, వాసుదేవరావు, రాజు, టీడీపీ నాయకులు కోదండరాం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీ, సీఈఎంఎస్‌ల మధ్య అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఎస్‌ఆర్‌ఐటీ, సీఈఎంఎస్ ఉద్యోగులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 14: విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి విశాఖపట్నం సెంటర్ ఆఫ్ ఎక్సలెంట్స్ ఇన్ మ్యారీ టైం అండ్ షిప్ బిల్డింగ్‌తో ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్‌రవి తెలిపారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐఆర్‌టీ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, సీఈఎంఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శేతు మాధవన్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గోపికృష్ణశివం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ ఒప్పందం వలన విద్యార్థులు, అధ్యాపకులు ఇంటర్న్‌షిప్, సర్టిపై కోర్సులు స్వల్పకాల ప్రాజెక్టులు, వర్క్‌షాప్, ప్లేస్‌మెంట్‌లో సహాయం, ఎక్స్‌డీపీలు, పరిశోధన, విద్యా కార్యక్రమాల ద్వారా ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఒప్పందం జరగడం పట్ల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తమ కళాశాల మరో మైలురాయిని చేరుకుందని కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడం హర్షణీయం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

బద్వేలు, జూన్ 14: చంద్రబాబు ఇచ్చిన హామీల మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడం, అలాగే మెగా డీఎస్సీ, వితంతువులకు, వృద్ధులకు పెన్షన్ పెంపు హర్షణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం సీపీఐ ఏరియా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన రోజే ఐదు ముఖ్యమైన అంశాలపైన సంతకాలు చేయడం శుభపరిణామమని, రాబోయే రోజులలో కూడా ఇచ్చిన వాగ్దానాలను ప్రతి ఒక్కటి అమలు చేయాలని అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ ఆక్రమణలను ల్యాండ్‌మైనింగ్ అక్రమార్కులపై కేసులు నమోదు చేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు, వెంకటరమణ,పివి.రమణ, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో గ్రీన్ కడపగా తీర్చిదిద్దుదాం

● ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 14 : 'కడప నగరాన్ని సమష్టి కృషితో గ్రీన్ కడపగా తీర్చిదిద్దుదాం' అని కడప ఎమ్మెల్యే ఆర్. మాధవీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలకనుకూలంగా మౌలిక వసతులు ఏర్పాటుచేయాలన్నారు. నగరంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూ ములను గుర్తించి వాటికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అభివృద్ధికి సంబంధించి చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప నగరం వైసీపీ ప్రభుత్వ హయాంలో అధ్వానంగా మారిందన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేశారన్నారు. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ చాలా అధ్వానంగా మారిందని, దాన్ని సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో ఒక కాలనీని మోడల్‌గా తీసుకుని దాన్ని తీర్చిదిద్దాలన్నారు. కడప నగరంలో ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు అడ్డదిడ్డంగా ఉ న్నాయని, వాటిని సరిచేయాలన్నారు. ఇంటింటా చెత్తసేకరణకు సంబంధించి పన్నులు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. టీడీపీ హయాంలో నిర్మాణ మైన టిడ్కో ఇళ్లను త్వరలో లబ్ధిదారులకు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కడపను సుందర నగరంగా తీర్చాల్సిన బాధ్యత అధికారులకు, పాలకులదేనన్నారు.ఈ కార్యక్రమంలో శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కొరడా ఝులిపించాలి

రెవెన్యూ అధికారులు సిబ్బందితో తహసీల్దారు సమీక్ష



ప్రొద్దుటూరు ,జూన్ 14 : ప్రొద్దుటూరు పెన్నానదినుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాపై కొరడా ఝులిపించాలని తహసీల్దారు విద్యాసాగర్ రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన డిప్యూటీ తహసీల్దార్లు ఆర్ఐ, వీఆర్‌వోలతో ఇసుక అక్రమ రవాణా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై తహసీల్దారు ఆదేశించారు.ఇసుక అక్రమ రవాణాలో ఎంతటి వారున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. క్రిమినల్ కేసులు పెడతామన్నారు. నదిలోకి ట్రాక్టర్లు వెళ్ళకుండా మార్గాలన్నీ మూసేస్తామన్నారు. ఏరియాకు ఇద్దరు వీఆర్‌వోలను టీంలుగా వేసి రాత్రి,పగలు ఇసుక నదిలో నుంచి రవాణా కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీటీలు సాయినాథరెడ్డి, సుదర్శన్, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, వీఆర్‌వోలు చెన్నా రవి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లను విద్యార్థులకు అందజేయాలి



ప్రొద్దుటూరులో పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో అనూరాధ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 14: పాఠశాలలు ప్రారంభం అయినందున స్టూడెంట్ కిట్లను విద్యార్థులకు అందజేయాలని డీఈవో ఎం.అనూరాధ పేర్కొన్నారు. శుక్రవారం అనిబిసెంట్‌మున్సిపల్ హైస్కూలులో నిలువ ఉంచిన పాఠ్యపుస్తకాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టాక్‌పాయింట్ నుంచి పుస్తకాలను వీలైనంత త్వరగా పాఠశాలలకు చేర్చాలని, విద్యార్థులకు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 1 నుంచి 7వ తరగతి వరకు పుస్తకాల కొరత ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే కడప నుంచి వెంటనే సరఫరా చేస్తామన్నారు. 8, 9, 10వ తరగతిలలో కొరత ఉన్న పాఠ్యపుస్తకాలు మంగళవారం విజయవాడ నుంచి వస్తాయని తెలిపారు. పాఠ్యపుస్తకాలు పంపిణీ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులకు ఇంకా కొరత ఉంటే ప్రతిపాదనలు పంపాలని ఎంఈవోలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కడప డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి, ఎంఈవోలు సావిత్రమ్మ, శోభారాణి, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫాం తరలింపు

పోరుమామిళ్ల, జూన్ 14 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం తరలించారు. మండలంలో 80 పాఠశాలలకు గాను 65 ప్రాథమికపాఠశాలలు, నాలుగు ప్రాథమిక ప్రాథమి కోన్నత పాఠశాలలు, 11 హైస్కూళ్లకు సంబంధించి 4940 మంది విద్యార్థులకు మెటీరియల్‌ను ఎంఈవోలు బాల అంకిరెడ్డి, కాశయ్య ఆయా పాఠశాలలకు పంపిం చారు. శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి వాహనాల ద్వారా అన్ని ప్రభుత్వపాఠశాలలకు చేరే విధంగా చర్యలు తీసుకున్నారు.